

## వైపాలెం టీడీపీలో వర్గపోరు

వైపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు చర్యలతో నియోజకవర్గంలో పార్టీ అడ్రస్ లేకుండా పోతోందని పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. - 8లో..



## పౌరులంతా ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఓటు హక్కును వినియోగించుకోవడం అనేది ఓటు హక్కు కలిగిన ప్రతి పౌరుడి కనీస బాధ్యతని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 32/22

## వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

## న్యూస్‌రీల్

### తాగునీటి సరఫరాకు 15వ ఆర్థిక సంఘం నిధులు

ఒంగోలు అర్బన్: జిల్లాలో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులను కేటాయించాలని ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ జిల్లా పరిషత్, జిల్లా పంచాయతీలకు సూచిస్తూ ఆదేశాలు జారీ చేశారు. గతంలో 82 ఆవాస ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేవారు. అయితే ఆ ప్రక్రియలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయనే దానిపై బిల్లులను చెల్లించడం ప్రభుత్వం నిలిపివేసింది. అయితే జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత 70 ప్రాంతాలకు నీటి సరఫరా అవసరమని గుర్తించడంతో ఆయా ప్రాంతాలకు అవసరమైన తాగునీటి సరఫరాకు సంబంధించి బిల్లులను జిల్లా పరిషత్ సీఈఓ, జిల్లా పంచాయతీ అధికారికి నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

### కేసుల పరిష్కారానికి కక్షిదారులు సహకరించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి



జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

ఒంగోలు: ఇరువర్గాల ఆమోదంతో కేసుల పరిష్కారానికి కక్షిదారులు సహకరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి అన్నారు. మార్చి 9వ తేదీ కక్షిదారుల సౌకర్యార్థం జిల్లా వ్యాప్తంగా అన్ని న్యాయస్థానాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా రాజీకి అర్హత కలిగిన క్రిమినల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమా పరిహార చెల్లింపు కేసులు, చెక్ బౌన్స్ కేసులు, వివాహ సంబంధ వ్యాజ్యాలు వంటి అన్ని రకాల సివిల్ కేసులు ఇద్దరి ఆమోదంతో పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల్లో ఉన్న వారు ఉపయోగించుకుని వ్యాజ్యాలను పరిష్కరించుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసుల్లో అప్పీల్‌కు వెళ్లే అవకాశం లేదని, కోర్టుల్లో చెల్లించిన కోర్టు ఫీజును కూడా తిరిగి పొందవచ్చన్నారు. ప్రీసిట్టింగ్ రూపంలో ఇరువర్గాల ఆమోదంతో ముందస్తుగా వ్యాజ్యాలు పరిష్కారానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ, సంబంధిత న్యాయవాదులు, మీడియేషన్ న్యాయవాదులు, న్యాయమూర్తులు సహకరిస్తారన్నారు. అదే విధంగా పోలీసు అధికారులు, ప్రభుత్వ అధికారులు, న్యాయవాదులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని కేసుల పరిష్కారానికి సహకరించాలన్నారు.

### ఏపీఈడబ్ల్యూడీ కార్పొరేషన్ ఎండీగా హుస్సేన్‌రెడ్డి



బేస్తవారిపేట: ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా మండలంలోని చెట్టిచర్లకు చెందిన మాచర్ల హుస్సేన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, రీజినల్ కో ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, జేసీఎస్ కోఆర్డినేటర్ కాశిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.



చిన్నప్పుడు తండ్రి తరచూ 'చదువు' అంటూ చెప్పే మాటను లక్ష్యంగా పెట్టుకున్నారు. డాక్టర్ కావాలనే కలను కుటుంబ ఆర్థిక పరిస్థితి కారణంగా సాకారం చేసుకోలేకపోయారు. అంతటితో చదువు ఆగిపోకూడదనుకున్నారు. చదువే భవిష్యత్ అని నాన్న మాట స్ఫూర్తిగా మొక్కవోని లక్ష్యంతో డిగ్రీ వైపు అడుగులు వేశారు. ఆ సమయంలో ఆ కళాశాల రగిల్చిన స్ఫూర్తితో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. ఆ కళాశాలలో చదివిన విద్యార్థులు.. చదువు చెప్పిన అధ్యాపకులు రాష్ట్ర స్థాయి అధికారులుగా.. పాలకులుగా ఎదిగిన వైనం మరింత స్ఫూర్తి నింపింది. తాను చదువుకున్న ప్రాంతంలో పోలీసు అధికారి కీర్తి ఇంకా స్ఫూర్తిని దృఢపరిచింది. తొలి ప్రయత్నంలోనే గ్రూప్-1 పరీక్షలో స్టేట్ 8వ ర్యాంకు సాధించి డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. అతి తక్కువ కాలంలోనే అనేక హోదాల్లో కర్తవ్యాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్‌ఓ)గా అవకాశం వచ్చింది. చదువులోనే కాదు.. విధి నిర్వహణలో కూడా అకుంఠిత దీక్షతో ముందుకు సాగితే ఎలాంటి లక్ష్యాన్నయినా సాధించవచ్చంటున్నారు జిల్లా నూతన ఎస్పీ పరమేశ్వరరెడ్డి. ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న ఆయనతో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ... ఆయన మాటల్లోనే..

# నాన్న మాట.. నా బాట

- డాక్టర్ కలను కాదని.. గ్రూప్స్ వైపు
- ఐపీఎస్ వచ్చిన ఎనిమిదేళ్లకే సీఎం రక్షణ దళంలోకి..
- రాష్ట్రపతులు చదివిన కళాశాలలో అభ్యాసం
- అప్పటి ఎస్పీ స్టీఫెన్ క్రేజ్ చూసి పోలీస్ కావాలనుకున్నా..
- నూతన ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డితో ప్రత్యేక ఇంటర్వ్యూ

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: మాదో చిన్నపల్లెటూరు. నా చిన్నప్పుడు ఐదు వందల గడపలు మాత్రమే ఉండేవి. దిగువ మధ్య తరగతి కుటుంబం.. నాన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)లో చిరుద్యోగి. అమ్మ గృహిణి. మేం ముగ్గురం పిల్లలం. అక్క శ్రీలక్ష్మి ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ (ఐఎఫ్ఎస్) అధికారి, చెల్లి నాగజ్యోతి గ్రూప్-2 ఆఫీసర్. వ్యవసాయ నేపథ్యమున్న కుటుంబం మాది. మా గ్రామంలో ఎస్ఎస్ఎల్‌సీ చదివిన ప్రథమ వ్యక్తి మా నాన్నే. సాగునీరు సరిగ్గా లేక, బీడు భూముల్లో వ్యవసాయం చేయలేక ఊళ్లో రైతుల కష్టాలను కళ్లారా చూసిన వ్యక్తిగా చదువు విలువను తెలియజేస్తూ ఉన్నత విద్య దిశగా నడిపించారు.

**డిగ్రీ వరకు మిషనరీ, సర్కారు కళాశాలలే...**

ఒకటి నుంచి ఐదో తరగతి వరకు అనంతపురం పట్టణంలోని సెయింట్ అగస్టీన్ స్కూల్లో చదివా. ఆరు నుంచి పదో తరగతి వరకు ఎల్ఆర్‌జీ హైస్కూలులో, ఇంటర్‌లో బైపీసీ తీసుకుని శ్రీ సత్యసాయి బాబా జూనియర్ కళాశాలలో పూర్తి చేశా. ఎంబీబీఎస్ చేరేందుకు ఎంసెట్ రాసినా డొనేషన్‌తో చేరే ర్యాంకు వచ్చింది. కానీ నాన్నకు ఆర్థిక భారం కాకూడదనుకున్నా...చిన్నప్పుడు నాన్న చెప్పిన మాటలు గుర్తుకు తెచ్చుకుంటూ ముందుకు కదిలా. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బయోటెక్నాలజీలో బీఎస్సీ పూర్తి చేశా. ఆ తరువాత పీజీ చదువుదామనుకోలేదు. డిగ్రీ పూర్తి కాగానే గ్రూప్స్‌కు సిద్ధమయ్యా.

**స్ఫూర్తిరగిల్చిన ఆర్ట్స్ కాలేజీ...**

అనంతపురంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎంతో ఘన చరిత్ర ఉంది. రాష్ట్రపతులు సర్వేపల్లి రాధాకృష్ణమూర్తి, నీలం సంజీవరెడ్డి ఇక్కడే చదువుకున్నారు. సంజీవరెడ్డి అయితే ఇక్కడ అధ్యాపకులుగా కూడా పనిచేశారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో డీజీపీలుగా పనిచేసిన జీవీ రాముడు, అరవిందరావు కూడా ఇక్కడే చదువుకున్నారు. ఇలా ఇక్కడ చదువుకున్న వారెందరో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లుగా దేశ వ్యాప్తంగా సేవలు అందిస్తున్నారు. ఆ స్ఫూర్తితోనే కళాశాలలో డిగ్రీ చదువుతుండగానే గ్రూప్స్‌కు ప్రిపేరయ్యా. ఇక కళాశాలలో చదువుతున్న రోజుల్లో అనంతపురం ఎస్పీగా పనిచేసిన స్టీఫెన్ రవీంద్రకి పబ్లిక్‌లో ఉన్న క్రేజ్ చూసి పోలీసైతే బాగుంటుందని అనుకున్నా.

**ఆయన ఆప్యాయతకు మారుపేరు...**

ముఖ్యమంత్రి సీఎస్‌ఓ బాధ్యతలు నిర్వర్తించే అవకాశం అందరికీ రాదు. అరుదుగా వచ్చే అవకాశం. ఆ అవకాశం త్వరగానే వరించింది. తన దగ్గర పని చేసే ప్రతి ఒక్కరి పట్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ఆప్యాయంగా ఉంటారు. ఉద్యోగుల్లా కాకుండా కుటుంబ సభ్యుల్లా చూస్తారు.

**విద్యార్థి దశ చాలా కీలకం...**

విద్యార్థి దశ ప్రతి ఒక్కరికీ చాలా కీలకం. ఆ సమయంలో ఎంతో ప్రశాంతంగా ఉండాలి. చదువును ఆటపాటలతో మేళవింపు చేసుకుని సంతోషంగా చదువుకోవాలి. చదువును ఎప్పుడూ కష్టంగా చదవకూడదు. ఇష్టంగా చదవాలి. ప్రణాళికాబద్ధంగా చదివితే ఉన్నత లక్ష్యాలను సులువుగా అందుకోవచ్చు. పరీక్షల్లో ఫెయిల్ అయ్యామనో, లక్ష్యం గురితప్పిందనో నిరాశ చెందకూడదు. కనీసం సౌకర్యాలు లేని గ్రామాల నుంచి ఉన్నత శిఖరాలకు చేరుకున్న గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని అడుగులు ముందుకు వేయాలి. తిరుమల వెంకటేశ్వరస్వామి నా ఇష్ట దైవం.



### కుటుంబ నేపథ్యం...

| | |
|---|---|
| పేరు | : పోతన్నగారి పరమేశ్వర రెడ్డి |
| పుట్టిన తేదీ | : 30-07-1983 |
| తల్లిదండ్రులు | : నాగలక్ష్మి, నారాయణరెడ్డి |
| సొంతూరు | : పులేటిపల్లి గ్రామం, సీకేపల్లి మండలం, అనంతపురం జిల్లా |
| భార్య | : సాయిప్రసన్న |
| పిల్లలు | : ధాత్రి సాయిరెడ్డి, వైభవ్ |
| విద్యాభ్యాసం | : డిగ్రీ |

**ఉద్యోగ ప్రస్థానం**

★ 2008లో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో మొదటి ప్రయత్నంలోనే రాష్ట్ర స్థాయిలో ఎనిమిదో ర్యాంకు వచ్చింది. శిక్షణ పూర్తయిన తరువాత 2011లో మొదటి పోస్టింగ్ కృష్ణా జిల్లా గుడివాడ డీఎస్పీగా బాధ్యతలు.

★ ఆ తరువాత వరుసగా గ్రేహౌండ్స్ కమాండర్, కరీంనగర్ జిల్లా జగిత్యాల డీఎస్పీ, తెలంగాణలో సీఐడీ డీఎస్పీ, నెల్లూరు ఏసీబీ డీఎస్పీ, 2018లో ఏఎస్పీగా పదోన్నతి. 2019 వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే సీఎం ముఖ్య భద్రతాధికారిగా అవకాశం. రెండేళ్ల పాటు విధులు. 2021లో ఐపీఎస్‌గా ఎంపిక. 2022 మే నెలలో తిరుపతి ఎస్పీగా బాధ్యతలు.

# సచివాలయాలతో సుపరిపాలన



సంతనూతలపాడు అభ్యర్థిగా మేరుగు నాగార్జునను పరిచయం చేస్తున్న బాలినేని



శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని, ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఇన్‌చార్జి శివప్రసాదరెడ్డి

- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- సైనికుడిలా పనిచేస్తా ఆశీర్వదించండి: మంత్రి మేరుగు
- సచివాలయాలు, ఆర్‌బీకే, ఇతర అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు
- కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఇన్‌చార్జి శివప్రసాద్‌రెడ్డి

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల ద్వారా ప్రజలకు అద్భుతమైన పరిపాలన అందిస్తున్నారని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డితో కలిసి గురువారం కూనంనేనివారిపాలెం, గోనుగుంట, రామచంద్రాపురం గ్రామాల్లో సచివాలయాల సముదాయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేనివారిపాలెంలో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవంలో బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా సచివాలయాల ద్వారా ప్రజలకు పరిపాలనను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పైసాను పారదర్శకంగా ప్రజలకు అందించారన్నారు. కానీ చంద్రబాబు హయాంలో ప్రజల సొమ్మంతా జన్మభూమి కమిటీలకు చేరాయని ఎద్దేవా చేశారు. జిల్లాల విభజనలో సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గం బాపట్ల జిల్లాలో కలపాల్సి ఉందని, కానీ ఒంగోలు చుట్టుపక్కల విస్తరించి ఉన్న సంతనూతలపాడు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలోనే ఉండేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఒప్పించానని, అందుకు సంతనూతలపాడు నియోజకవర్గ ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలపాలన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్తగా జిల్లా మంత్రి మేరుగు నాగార్జునను సీఎం నియమించారని, ఆయన్ను గెలిపించాల్సిన బాధ్యత తనతో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వారి కుటుంబంపై ఉందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మేరుగు నాగార్జునను మంచి మెజారిటీతో గెలిపించాలని ఆయన్ను పరిచయం చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ బాలినేని శ్రీనివాసరెడ్డి సూచనలు పాటిస్తూ బూచేపల్లి కుటుంబం అండదండలతో నియోజకవర్గంలోని ప్రజలందరినీ కలుపుకుపోతానని, సైనికుడిలా పనిచేస్తూ వైఎస్సార్ సీపీ జెండాను తన భుజాన వేసుకొని మోస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో సంతనూతలపాడు ఎమ్మెల్యేగా గెలిపించాలని స్థానిక ప్రజలకు మేరుగు నాగార్జున విజ్ఞప్తి చేశారు. జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీ గ్రామాల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసే వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అమూల్ సంస్థ వారి ద్వారా ఒక్కో లీటర్ పాలపై నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు అదనపు ఆదాయం వస్తుందని తెలిపారు.

**రూ.4.75 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన**

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఇన్‌ఛార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా కూనంనేనివారిపాలెం, గోనుగుంట, రామచంద్రాపురం గ్రామాల్లో కలిపి రూ.4.75 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. వాటిలో రూ.1.20 కోట్లతో నిర్మించిన మూడు సచివాలయాలు, రూ.41.6 లక్షలతో రెండు రైతు భరోసా కేంద్రాలు, రూ.17.6 లక్షలతో బల్క్ మిల్క్ సెంటర్లు, రూ.20 లక్షలతో బీసీ కమ్యూనిటీ హాలు, రామచంద్రాపురం-జీఎల్.పురం మధ్య రూ.47 లక్షలతో వంతెనను, కూనంనేనివారిపాలెం సచివాలయాల కాంప్లెక్స్ చుట్టూ రూ.30 లక్షలతో ప్రహరీ నిర్మాణాన్ని ప్రారంభించారు. వాటితో పాటు రూ.2 కోట్ల విలువైన పొగాకు గోడౌన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కూనంనేనివారిపాలెంలోని సచివాలయాలు, ఆర్‌బీకే, పొగాకు గోడౌన్‌ల నిర్మాణానికి అవసరమైన రూ.2 కోట్ల విలువైన 2 ఎకరాల స్థలాన్ని ఉచితంగా అందించిన దాతలు పమిడి వెంకటేశ్వర్లు, పమిడి రత్తమ్మ, పమిడి లక్ష్మీదేవమ్మ, పమిడి శ్రీనివాసరావు, పమిడి వెంకాయమ్మ, పమిడి నరశింహరావు, గోరంట్ల వెంకట రమణయ్య, ప్రసాద్ అందించారు. వారిని ఈ సందర్భంగా బాలినేని, మేరుగు, బూచేపల్లి చేతుల మీదుగా శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి అభినందించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్య ప్రెసిడెంట్ వాకా బసివిరెడ్డి, వైస్ ఎంపీపీ జ్యేష్ఠ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ చీమకుర్తి పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, గోగినేని వెంకటేశ్వర్లు, జేసీఎస్ కన్వీనర్లు మంచా హరికృష్ణ, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, యర్రగుంట్ల వసంతరావు, ఏలూరి శ్రీలక్ష్మి, ఏలూరి సుబ్బారావు, యర్రగుంట్ల మోహన్, బొడ్డు కోటేశ్వరరావు, కుంచాల రాంబాబు, ఓబుల్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## నేడు మహా సూర్య వందనం

- పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో యోగా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ, కలెక్టర్



పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఒంగోలు సబర్బన్: జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో చేస్తున్న యోగా ఏర్పాట్లను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్..ఎస్పీ పరమేశ్వరరెడ్డితో కలిసి గురువారం పరిశీలించారు. ఈ నెల 16వ తేదీన ఉదయం ప్రణవ్ సంకల్ప యోగా సమితి వ్యవస్థాపకుడు పతంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా సూర్య వందనం కార్యక్రమ ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్- భారత వరల్డ్ రికార్డు నమోదులో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. దాంతో పాటు ప్రజల్లో యోగాపై అవగాహన పెంపొందించే కార్యక్రమానికి కూడా శ్రీకారం చుట్టామన్నారు. దాదాపు 3 వేల మంది పాఠశాలల విద్యార్థులతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. యోగా సందర్భంగా విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు జరగకూడదని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ప్రత్యేకంగా వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆర్.సుశీల, సెట్నల్ మేనేజర్ శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పేదల ప్లాట్లకు నంబర్ల కేటాయింపు

- 21 వేల మందికి ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చేందుకు డిజైన్ సిద్ధం
- డిజైన్‌ను పరిశీలించిన నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు



నంబర్లు కేటాయించిన డిజైన్‌ను పరిశీలిస్తున్న మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్

ఒంగోలు సబర్బన్: నగరంలో సొంతిల్లు లేని నిరుపేదల ఇళ్ల స్థలాల కోసం డిజైన్‌ను పూర్తి చేసి ఇళ్ల స్థలాల నంబర్లు కేటాయించినట్లు ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత పేర్కొన్నారు. ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో గురువారం ఒంగోలు నగరటౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు సిద్ధం చేసిన ప్లాట్ల డిజైన్‌ను మేయర్ గంగాడ సుజాతతో పాటు డిప్యూటీ మేయర్లు వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవరావు, కార్పొరేటర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్లాట్లు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నామన్నారు. మొత్తం 25 వేల మంది నగరంలోని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఎంత త్యాగం చేశారో నగర ప్రజలకు తెలుసన్నారు. ఎంతో కష్టపడి రైతుల నుంచి భూములు కొనుగోలు చేసి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.230 కోట్లు కూడా విడుదల చేసినట్లు వివరించారు. ఇప్పటికే 400 ఎకరాలకు పైగా రైతుల నుంచి భూములు కొనుగోలు చేసి రూ.131 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు కూడా వెల్లడించారు. మొత్తం 25 వేల మంది పేదలకు సొంతింటి కల నెరవేర్చేలా ప్లాట్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. నగర ప్లానింగ్ విభాగం అధికారులు 21 వేల ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు డిజైన్‌లు సిద్ధం చేశామన్నారు. వారం పది రోజుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతల మీదుగా పేదల ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నామన్నారు. మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నిరుపేదల చిరకాల కోరిక తీర్చేందుకు సిద్ధమయ్యారన్నారు. కార్యక్రమంలో ఏసీపీ కేవీ.వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్లు వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవరావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# కొండపిపై జెండా ఎగరేద్దాం



పార్టీ నాయకులు, కార్యకర్తల ముఖాముఖిలో మాట్లాడుతున్న మంత్రి సురేష్

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ(మర్రిపూడి): వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఎటువంటి విభేదాలు లేకుండా కలిసికట్టుగా పనిచేసి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. సింగరాయకొండలోని వెంకటేశ్వర కళ్యాణమండపంలో గురువారం ఉదయం సింగరాయకొండ పంచాయతీ నేతలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండలంలో ప్రధానంగా దేవాదాయ భూముల రిజిస్ట్రేషన్, ఆయితా రామయ్య శ్రేష్ఠి సత్రం, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో మండలంలోని నాయకులు, కార్యకర్తలు విభేదాలు మరిచి కలిసికట్టుగా పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. తాను ఎన్నికల తరువాత కూడా ఇక్కడే నివాసం ఉండి ప్రజలకు అందుబాటులో ఉంటానని, ప్రజలకు సేవచేయడమే కర్తవ్యమని ఆయన వివరించారు. పార్టీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, సర్పంచ్ తాటిపర్తి వనజ, జిల్లా మైనారిటీ సెల్ ప్రధానకార్యదర్శి షేక్ కరీం, షేక్ పటేల్, పార్టీ జిల్లా నాయకులు పాలూరి శ్రీనివాసులరెడ్డి, పఠాన్ రియాజ్, షేక్ సలీంబాషా, షేక్ సలీం, గాదంశెట్టి గుప్తా, సోమిశెట్టి సురేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పొగాకు బ్యారన్ దగ్ధం



దగ్ధమవుతున్న పొగాకు బ్యారన్

**పొదిలి రూరల్:** మండలంలోని అన్నవరంలో బుధవారం అర్ధరాత్రి పొగాకు బ్యారన్ దగ్ధమైంది. గ్రామానికి చెందిన యర్రంరెడ్డి పెద్ద చెన్నారెడ్డి బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్ జరుగుతున్న సమయంలో గొట్టం దగ్గర నిప్పురవ్వలు ఆకుపై పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి బ్యారన్ మొత్తం వ్యాపించాయి. దీంతో బ్యారన్‌లో ఉన్న పొగాకుతో పాటు అల్లుడు కర్ర, బ్యారన్‌కు అమర్చిన టైర్లు మొత్తం కాలి బూడిదయ్యాయి. దాదాపు రూ.2 లక్షల నష్టం జరిగినట్లు రైతు తెలిపారు.

### పాము కాటుతో రైతు మృతి



మృతి చెందిన యేసేబు (ఫైల్)

**తాళ్లూరు (ముండ్లమూరు):** పాము కాటుతో రైతు మృతి చెందిన సంఘటన తాళ్లూరు మండలంలోని నాగంబొట్లపాలెంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామంలోని ఎస్సీకాలనీకి చెందిన రావినూతల యేసేబు (33) పశువుల మేత కోసం పొలం వెళ్లాడు. పొలంలో మేత కోస్తుండగా పాము కాటుకి గురై మృతి చెందాడు. యేసేబు ఎంతసేపటికీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వెళ్లి చూడగా మృతి చెంది కనిపించాడు. మృతదేహంపై ఉన్న ఆనవాళ్లను బట్టి పాముకాటుకి గురైనట్లు నిర్ధారణకు వచ్చారు. మృతుడికి భార్య దివ్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. యేసేబు మృతిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వైవీ రమణయ్య తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు చెప్పారు.

# పౌరులంతా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఒక ఆయుధం
- కలెక్టర్ దినేష్‌కుమార్



స్వీప్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

**ఒంగోలు అర్బన్:** ఓటు హక్కును వినియోగించుకోవడం అనేది ఓటు హక్కు కలిగిన ప్రతి పౌరుడి కనీస బాధ్యతని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్)లో భాగంగా జిల్లాలోని ఇంజినీరింగ్, డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాళ్లు, కో ఆర్డినేటర్లు, క్యాంపస్ అంబాసిడర్లకు స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన భవనంలో గురువారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే మన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ అతి పెద్దదని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఒక వజ్రాయుధం వంటిదని, ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని ఉత్తమ నాయకత్వాన్ని ఎన్నుకోవాలని సూచించారు. గతంలో ఎన్నికల్లో తక్కువ శాతం మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకునేవారన్నారు. నేడు ఎన్నికల సంఘం విస్తృతంగా ఓటు హక్కు ప్రాముఖ్యత, ఓటు నమోదు కార్యక్రమాలు చేపట్టడంతో పోలింగ్ శాతం మెరుగుపడినట్లు తెలిపారు. ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు రాలేని, కదల్లేని పరిస్థితుల్లో ఉన్న వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు వారి ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషనర్ కొత్తగా అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఓటింగ్ శాతం మరింత పెంచేందుకు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. అందులో భాగంగానే ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్యాంపస్ అంబాసిడర్లు ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలన్నారు. స్వీప్ నోడల్ అధికారులు మెప్మా పీడీ రవి, డ్రగ్స్ కంట్రోల్ ఏడీ జ్యోతి, నాగేశ్వరరావు శిక్షణ కార్యక్రమంలో క్యాంపస్ అంబాసిడర్లకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డీఈఓ సుభద్ర, ట్రిపుల్ ఐటీ ఓఎస్‌డీ నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎటువంటి ఒత్తిడిలకు ప్రభావితం కాకుండా నిర్భయంగా ఓటు వేస్తామని శిక్షణకు హాజరైన అంబాసిడర్లు, విద్యార్థులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఈవీఎంలపై అవగాహన కల్పించారు.

# వై.పాలెం టీడీపీలో వర్గపోరు

- ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వర్గాలుగా విభజిస్తున్నాడని నాయకుల ఆగ్రహం
- నియోజకవర్గంలో టీడీపీ భూస్థాపితం కావడం ఖాయమంటూ గగ్గోలు
- విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మరీ భగ్గుమన్న పచ్చనేతలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

**యర్రగొండపాలెం:** నియోజకవర్గంలో టీడీపీ భూస్థాపితం అవుతోందని, వెంటనే అధిష్టానం జోక్యం చేసుకోవాలని ఆ పార్టీ నాయకులు గగ్గోలు పెట్టారు. స్థానిక ఏఎంసీ మాజీ చైర్మన్ చేకూరి ఆంజనేయులు గృహంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మరీ టీడీపీ నాయకులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమ పార్టీకి చెందిన నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు వర్గాలుగా విభజించి తనకిష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన చర్యలతో నియోజకవర్గంలో తమ పార్టీ అడ్రస్ లేకుండా పోతోందని ఆవేదన చెందారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీగా పనిచేసిన ఆయన.. పార్టీ పటిష్టతకు కృషి చేస్తాడని, ఏపీ టెక్నికల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మన్నే రవీంద్ర సిఫార్సు మేరకు అధిష్టానం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించిందని అన్నారు. అటువంటి వ్యక్తి.. కింది స్థాయి రాజకీయాలకే పరిమితమయ్యాడని వ్యంగ్యంగా అన్నారు. నియోజకవర్గంలో రెండు పర్యాయాలు పార్టీ ఓటమి పాలైందని, మూడోసారి కూడా ఓటమి అంచున ఉందన్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన బూదాల అజితారావుకు వచ్చిన ఓట్లతోనే ఎరిక్షన్‌బాబు రాజకీయం చేస్తున్నాడని, ఆ ఓట్లను పెంచుకునే అవకాశం ఉన్నప్పటికీ అటువంటి చర్య ఏమాత్రం చేయడం లేదని, అటువంటప్పుడు నియోజకవర్గంలో పార్టీ ఏ విధంగా గెలుస్తుందని వారు ప్రశ్నించారు. పార్టీ కార్యక్రమాల్లో మైకు గులగాళ్లు టీడీపీ నాయకులపై చేస్తున్న విమర్శలను ఖండించకుండా పైశాచిక ఆనందం పొందుతున్నాడని మండిపడ్డారు. పార్టీలో ఎవరు వెదవలు ఉన్నారో ప్రజలకు తెలుసని, నియోజకవర్గంలో 96 పంచాయతీలలో వర్గపోరును ప్రోత్సహిస్తున్నారని వారు అన్నారు. ఇప్పటికే పార్టీలో ఉన్న గ్రూపులు పోట్లాడుకుని మూడు పోలీసు కేసులు పెట్టుకున్నాయని, అటువంటి పరిస్థితుల్లో ఎరిక్షన్‌బాబు ప్రజలకు ఏం న్యాయం చేస్తాడని వారు ప్రశ్నించారు. అధిష్టానం అభ్యర్థిని మార్చకపోతే తమ దారి తాము చూసుకోవాల్సి వస్తుందని నాయకులు హెచ్చరించడంతో వై.పాలెం నియోజకవర్గం టీడీపీలో వర్గపోరు మరోసారి తీవ్రస్థాయిలో చర్చకు దారి తీస్తోంది. విలేకరుల సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చేకూరి ఆంజనేయులు, టీడీపీ ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్.జిలానీ, త్రిపురాంతకం మాజీ ఎంపీపీ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి అలవాల శ్రీనివాసరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి కె.అనిల్ కుమార్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వడ్లమూడి లింగయ్య, వెన్నా వెంకటరెడ్డి, సీతయ్య, నాయకులు పోతిరెడ్డి రమణారెడ్డి, ఎం.సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# కలిసిమెలిసి పనిచేద్దాం



మాట్లాడుతున్న దద్దాల నారాయణయాదవ్

- 19న పరిచయ కార్యక్రమానికి హాజరై ఆశీర్వదించండి
- వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పిలుపు
- పరిచయ కార్యక్రమానికి బాలినేని, చెవిరెడ్డి, పార్టీ నేతలు హాజరవుతారని వెల్లడి

**కనిగిరి రూరల్:** జగనన్న ఆశీసులు, వాసన్న దీవెనలతో వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా ఈ నెల 19న నిర్వహించనున్న తన పరిచయ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా హాజరై తనను ఆశీర్వదించాలని డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని పవిత్ర కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించే పరిచయ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పార్టీ ఒంగోలు పార్లమెంట్, ఉమ్మడి నెల్లూరు జిల్లా కో ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యన్నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు, ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల పార్టీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు హాజరవుతారని తెలిపారు. ఆ రోజు స్థానిక చెక్‌పోస్టు వద్ద నుంచి ర్యాలీగా వచ్చి పవిత్ర కళ్యాణ మండపంలో పరిచయ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి, పట్టణంలోని అన్ని వార్డుల నుంచి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని దద్దాల పిలుపునిచ్చారు.

**కనిగిరి కోటపై వైఎస్సార్ సీపీ జెండా ఎగరేద్దాం...**

మనమంతా కలిసికట్టుగా పనిచేద్దాం.. కనిగిరి కోటపై వైఎస్సార్ సీపీ జెండాను మళ్లీ ఎగరేద్దాం... జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పిలుపునిచ్చారు. సామాన్యుడైన తనకు ఉన్నత స్థాయి గుర్తింపునిచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన నవరత్నాల పథకాలతో ప్రతి ఇంట్లో సంక్షేమ లబ్ధి జరిగిందన్నారు. పార్టీ శ్రేణులంతా క్షేత్ర స్థాయిలో సంక్షేమ లబ్ధిదారులను కలిసి జరిగిన లబ్ధిని వివరించి ప్రజలను చైతన్యవంతులుగా చేయాలన్నారు. జగనన్న మళ్లీ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని వివరించాలన్నారు. విలేకరుల సమావేశంలో కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి (బన్నీ), ఎంపీపీలు దంతులూరి ప్రకాశం, అత్యాల జఫన్య, జెడ్పీటీసీలు మడతల కస్తూరిరెడ్డి, ఒకే రెడ్డి, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్.మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్లు ఆర్.మాణిక్యరావు, పార్టీ రాష్ట్ర నాయకులు బసిరెడ్డి పిచ్చిరెడ్డి, తమ్మినేని సుజాత, గోవర్ధన్‌రెడ్డి, ఎస్‌కే ఖాశింసా, దాసరి మురళి, చింతం శ్రీనివాసుల యాదవ్, కటికల వెంకటరత్నం, మూలే గోపాల్‌రెడ్డి, మండాది కృష్ణారెడ్డి, జీ అబ్రహం లింకన్, చొప్పరపు తిరుపతయ్య, పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జీ బొర్రారెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బొట్టు శ్రీను, ముద్దా బాబు, మీరావలి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీల్లో జిల్లా నాయకులకు పదవులు

**ఒంగోలు:** వైఎస్సార్ సీపీ లీగల్ సెల్, ఎస్టీ సెల్ రాష్ట్ర కమిటీల్లో పలువురు జిల్లా నాయకులకు పదవులు కేటాయిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు పేర్కొన్నారు. లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా టి.వెలుగొండయ్య, కార్యదర్శిగా బొజ్జా సురేంద్ర చక్రవర్తి, సంయుక్త కార్యదర్శిగా ఇమ్మడిశెట్టి నాగేశ్వరరావులను నియమించారు. ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా భుక్యా నాగేంద్ర నాయక్, పేరం శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా ఎస్.సతీష్‌ను నియమించారు.

## 20న ఒంగోలులో జాబ్‌మేళా

**ఒంగోలు టౌన్:** ఒంగోలులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 20వ తేదీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి టి.భరద్వాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్టెల్ పేమెంట్ బ్యాంక్, శ్రీ చక్ర హ్యూండాయ్ రిక్రూటర్స్ కంపెనీస్‌లో రిటైల్ బ్యాంక్ మిత్ర, అడ్మినిస్ట్రేటివ్ ఇన్‌చార్జి, సేల్స్ కన్సల్టెంట్, ట్రైనర్, యూజ్డ్ కార్ వాల్యూయేటర్స్, సేల్స్ క్యాషియర్స్, బిల్లింగ్ ఎగ్జిక్యూటివ్స్ తదితర ఖాళీలను భర్తీ చేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ చదివి 18 నుంచి 30 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. ఎంపిక కాబడిన అభ్యర్థులకు నెలకు 13 వేల నుంచి 15 వేల రూపాయల వరకు జీతంతో పాటు పనితీరు ఆధారంగా ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు 08592 281776 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# 18న వైఎస్సార్ ఆర్చి, విగ్రహ ఆవిష్కరణ



చెవిరెడ్డిని ఆహ్వానిస్తున్న డాక్టర్ బత్తుల

- చెవిరెడ్డిని ఆహ్వానించిన డాక్టర్ బత్తుల

**సింగరాయకొండ (మర్రిపూడి):** సింగరాయకొండ మండల కేంద్రంలో తన సొంత నిధులతో నిర్మించిన వైఎస్సార్ ఆర్చి, విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఈ నెల 18వ తేదీ నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ ఒంగోలు పార్లమెంట్, నెల్లూరు ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డిని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాపరెడ్డి నివాసంలో గురువారం కలిసి శాలువాతో సత్కరించి ఆహ్వానించినట్లు డాక్టర్ బత్తుల వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు కూడా హాజరవుతున్నారని చెప్పారు. బత్తుల వెంట పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శీలం రాము, చుక్కా కిరణ్‌కుమార్, కె.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు ఆమోదం



సమీక్షిస్తున్న మేయర్ గంగాడ సుజాత

- ఒంగోలు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశంలో 36 అంశాలపై సమీక్ష

**ఒంగోలు సబర్బన్:** నగరపాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇప్పటి వరకు నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. పనులు వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 36 అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఇకపై నగరంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలో చర్చించి పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. సమావేశంలో కమిషనర్ ఎం.జస్వంతరావు, ఏసీపీ కేవీ వెంకటేశ్వర్లు, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆదిపూడి గిరిజా శంకర శాండిల్య, కండే స్వాతి, నూకతోటి మస్తానమ్మ, వెన్నపూస కుమారి, షేక్ ఫాతిమాబీ, ఇతర ఇంజినీరింగ్, పారిశుధ్య, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

# 45.83 కోట్లతో కౌన్సిల్ బడ్జెట్ ప్రతిపాదన

- 2023–24 అంత్య నిల్వ 11.02 కోట్లు
- మున్సిపల్ చైర్మన్ వెల్లడి



మాట్లాడుతున్న చైర్మన్ చిర్లంచర్ల కృష్ణ

**మార్కాపురం టౌన్:** స్థానిక పురపాలక సంఘానికి సంబంధించి 2024 – 25 సంవత్సరానికి బడ్జెట్‌ను మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీ కృష్ణ సమావేశంలో ప్రవేశపెట్టారు. ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రారంభ నిల్వ రూ. 11.02 కోట్లు, ఆదాయం రూ. 34.80 కోట్లు మొత్తం రూ. 45.83 కోట్లతో బడ్జెట్‌ను వివిధ పనుల నిమిత్తం కేటాయించారు. గురువారం అమరజీవి పొట్టిశ్రీరాములు కౌన్సిల్ సమావేశం హాలులో బడ్జెట్, అత్యవసర సమావేశాన్ని చైర్మన్ కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. మార్కాపురం పురపాలక సంఘ పరిధిలో మౌలిక వసతులతోపాటు అభివృద్ధి పనులకు ప్రాధాన్యత క్రమంలో నిధులను విభజించారు. నీటి సరఫరాకు రూ. 28 లక్షలు, డ్రైనేజీ రూ. 21 లక్షలు, రహదారులకు రూ. 39.20 లక్షలు, రిక్రియేషన్ నిమిత్తం రూ. 9.80 లక్షలు, మార్కెట్, భవనాలు, కమ్యూనిటీ హాలు, టాయిలెట్లు వివిధ అవసరాల నిమిత్తం రూ. 28 లక్షలు, స్లమ్ ఏరియాల అభివృద్ధి నిమిత్తం రూ. 38.18 లక్షలు, షెడ్యూల్ తెగలకు రూ. 21 లక్షలు, షెడ్యూల్ ట్రైబ్స్‌కు రూ. 11.20 లక్షలు, మహిళా శిశు సంక్షేమానికి రూ. 7 లక్షలు, దివ్యాంగులకు రూ. 4.20 లక్షల ప్రకారం నిధులను కేటాయించనున్నారు.

**సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

మార్కాపురం పురపాలక సంఘం నిధుల్లో ఎక్కువ ప్రాధాన్యతను ఫాగింగ్‌కు ఇచ్చి దోమల బెడద నుంచి రక్షణ కల్పించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ సభ దృష్టికి తెచ్చారు. పట్టణంలో కుక్కలు, పందులు, కోతులు, ఆవుల సంఖ్య ఎక్కువగా ఉందని వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పట్టణంలోని 4వ వార్డులో అక్కమ్మబాయి స్థలం ఖాళీగా ఉందని, ఆక్రమణలు జరగక ముందే ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేస్తే ప్రజలకు ఉపయోగ కరంగా ఉంటుందని కౌన్సిలర్ చెప్పల్లి కనకదుర్గ చైర్మన్ దృష్టికి తెచ్చారు. సదరు విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లానని, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. శివాలయం తూర్పు ద్వారం వద్ద చప్టా శిథిలావస్థకు చేరిందని నిర్మించాలని కోరారు. తమ వార్డులో మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని కౌన్సిలర్ కశెట్టి నగేష్ చైర్మన్‌ను కోరారు. వార్డుకు కేటాయించిన నగదును అభివృద్ధి పనులకు కేటాయించి వార్డులో పనులను చేపట్టాలని కోరారు. చైర్మన్ కృష్ణ మాట్లాడుతూ కుక్కల బెడదను తగ్గించేందుకు చర్యలు చేపట్టామని, అయితే బ్లూక్రాస్ వారు అభ్యంతరం తెలపడంతో పట్టలేకపోతున్నామని తెలిపారు. కుక్కల సంతానం పెరగకుండా చర్యలు తీసుకోవడమే తప్ప వీటిని ఇక్కడ పట్టి వేరే ప్రాంతాలకు తరలించేందుకు బ్లూ క్రాస్ సభ్యులు తీవ్ర అభ్యంతరాలు చెబుతున్నారని, దీనిపై సమాలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. కొండేపల్లి రోడ్డులో గోశాల నిర్మాణం అనంతరం రోడ్లపై తిరిగే గోవులను గోశాలకు తరలించి వాటిని పర్యవేక్షిస్తారన్నారు. పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్క ప్రతినిధి సహకారంతో ముందుకుపోతున్నామని ప్రజలకు సేవ చేసేందుకే మనకు అవకాశం ఇచ్చారని చైర్మన్ తెలిపారు. సమావేశంలో కమిషనర్ రవీంద్ర, డీఈ సుభాని, మేనేజర్ శ్రీనివాసన్, ఆర్ఓ రంగారావు, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమస్యను సభ దృష్టికి తెస్తున్న వైస్ చైర్మన్ ఇస్మాయిల్, డాక్టర్ కనకదుర్గ

## మహిళను మోసం చేసి బంగారం చోరీ

**కురిచేడు:** ఆటోలో ప్రయాణిస్తున్న మహిళను తోటి ప్రయాణికులు మోసం చేసి బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటనపై కురిచేడు ఎస్సై ఆర్.సుమన్ కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముష్టగంగవరం గ్రామానికి చెందిన ఉన్నగిరి సౌందర్య తన అత్తగారి గ్రామమైన దర్శి మండలం రాజంపల్లి నుంచి గురువారం పుట్టింటికి వచ్చింది. ఆమె గర్భవతి కావడంతో ఆమె తండ్రి వెంకటేశ్వర్లు పుట్టింటికి నిద్రకు తీసుకొచ్చారు. కురిచేడులో వారి గ్రామం వైపు వెళ్లే రోజువారీ ఆటో కాకుండా కొత్త ఆటోలో వీరు ఎక్కారు. వెంకటేశ్వర్లు ముందు సీట్లో కూర్చోగా.. సౌందర్య వెనుక సీట్లో తోటి మహిళా ప్రయాణికులతో కలిసి కూర్చుంది. ఆ ప్రయాణికులు సౌందర్య పట్ల ఎంతో ప్రేమ చూపించినట్లు నటించి ఆమె గర్భిణి కావడంతో లగేజీ తాము పట్టుకుంటామంటూ తీసుకున్నారు. లగేజీలో ఉన్న బంగారు ఆభరణాలైన హారం, నక్లెస్, చెవి కమ్మలు కలిపి సుమారు 5 సవర్ల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఆటో దిగి ఇంటికి వెళ్లిన తర్వాత బ్యాగులు చూసుకుని ఆభరణాలు చోరీకి గురయ్యాయని గమనించి స్థానిక పోలీసులకు సౌందర్య ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమన్ తెలిపారు.

### నేడు వేలాది మందితో సూర్యనమస్కార సాధన

**ఒంగోలు మెట్రో:** రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం మధ్యాహ్నం 3.15 గంటలకు వేలాది మందితో సూర్య నమస్కారాల సాధన కార్యక్రమం జరుగుతుందని పతంజలి యోగా సమితి కోర్ కమిటీ సభ్యుడు బోయపాటి రవి ఒక ప్రకటనలో తెలిపారు. పతంజలి యోగా సమితి, ఒంగోలు వారి ఆధ్వర్యంలో స్థానిక రైజ్ కృష్ణసాయి ఇన్‌స్టిట్యూషన్స్ వారి సహకారంతో స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో పతంజలి యోగా రాష్ట్ర అధ్యక్షుడు యోగాచార్య గంధవళ్ల బాలసుబ్రహ్మణ్యం నేతృత్వంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. యోగా సాధకులు, యోగా అభిమానులు, ఆరోగ్యాభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్నిజయప్రదంచేయాలని విజ్ఞప్తి చేశారు.